


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI APTEL 2013/54510

Postal No: 3-78(D)-2026-2028






Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 283 పేజీలు - 08 వెల - 05/- శుక్రవారం 09-10-2026


# ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి..
## బస్టాప్‌లో 33 మంది పౌరుల మృతి

- ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి
- తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోర్స్క్ బస్టాప్‌పై బాంబుల వర్షం
- ఘటనలో 33 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన వైనం
- ఈ ఏడాదిలో ఇదే అతి పెద్ద సింగిల్ అటాక్

మిగతాది 2లో

ఉక్రెయిన్‌పై రష్యా మరోమారు క్షిపణి దాడులతో విరుచుకుపడింది. తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోర్స్క్ పట్టణంలో రద్దీగా ఉన్న ఒక బస్టాప్‌పై జరిగిన రాకెట్ దాడిలో 33 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడగా,



# ఓటు చోరీపై ఢిల్లీలో రేవంత్ నిరసన!

- ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర అంటూ రేవంత్ ఫైర్
- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న సీఎం రేవంత్
- ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణకు బీజేపీ ప్లాన్ అంటూ ఆరోపణలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్
- ఓట్లు తీసేస్తే రేపు రిజర్వేషన్లు కూడా తీసేస్తారని హెచ్చరిక



ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు.

మిగతాది 2లో



## సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి..

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్
- ఇద్దరు కమిషనర్ల నియామకం, 2023 చట్టంపైనా పిటిషన్‌లో అభ్యంతరం
- సెలక్షన్ కమిటీ నుంచి సీజేఐని తొలగించడాన్ని ప్రశ్నించిన పిటిషనర్
- సీఈసీ రాజీనామా కోరుతూ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు

దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ..
## రూ.22.6 లక్షల కోట్లు సమీకరించాం: సీఎం

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారుతున్నామన్న చంద్రబాబు

- నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- గ్లోబల్ ఇన్వెస్టర్లను సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానించిన సీఎం చంద్రబాబు
- జూన్ 2024 నుంచి రూ. 22.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయన్న సీఎం
- రాష్ట్రంలో 7.1 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి



*ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దశకు ఏపీ మారుతోందని, ప్రపంచ పెట్టుబడిదారులకు ఇదే సరైన సమయమని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని ఆయన గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆహ్వానించారు.*

గురువారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు ఈ సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 2024 నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ. 22.6 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టుల రూపంలో పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని యువతకు 7.1 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. సాంకేతికత ఆధారిత పాలనతో వ్యాపార అనుమతులు, ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతి రంగంలోనూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చంద్రబాబు వివరించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, రాయలసీమలో గ్లోబల్

## ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ..



- ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కీలక ప్రతిపాదన
- 2027 గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి
- రాష్ట్రంలో వర్షాభావం, వ్యవసాయ సంక్షోభంపై ప్రధానికి వివరణ

2

## బీసీలే మా వెన్నెముక..
### వారి రిజర్వేషన్లలో రాజీ లేదు: లోకేశ్

- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామన్న లోకేశ్
- రేపు సుప్రీంకోర్టు నుంచి కీలక తీర్పును ఆశిస్తున్నామని వ్యాఖ్య
- స్థానిక ఎన్నికల తర్వాతే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టీకరణ



2

# హెచ్-1బీ వీసాలపై వాన్స్ ఫైర్!



వీసా ప్రోగ్రామ్‌ను సంస్కరించాలని కాంగ్రెస్‌కు వాన్స్ పిలుపు

- హెచ్-1బీ వీసాలు దుర్వినియోగం చేస్తున్నారంటూ వాన్స్ తీవ్ర ఆరోపణలు
- ఇన్ఫోసిస్, టీసీఎస్ సహా ఆరు కంపెనీలపై నిషేధం విధించిన ట్రంప్ సర్కార్
- విదేశీ వర్కర్లకు తక్కువ జీతాలిచ్చి మోసం చేస్తున్నారని వాన్స్ విమర్శ
- అమెరికన్లతో పోలిస్తే 48,000 డాలర్ల వరకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని ఆరోపణ

2

హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ ను దుర్వినియోగం చేస్తున్నారంటూ పలు ఐటీ కంపెనీలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికన్ కార్పొరేషన్లు, విదేశీ ఔట్‌సోర్సింగ్ సంస్థలు కలిసి విదేశీ ఉద్యోగులను దోపిడీ చేస్తున్నాయని, వారి ద్వారా అమెరికన్ల జీతాలను దెబ్బతీస్తూ, వారి ఉద్యోగాలను విదేశీయులతో భర్తీ చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఇది విస్తృత స్థాయిలో జరుగుతున్న ఇమ్మిగ్రేషన్ మోసమని ఆయన అభివర్ణించారు. హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిబంధనలను కఠినతరం చేసి, అమెరికన్ వర్క్‌ఫోర్స్‌లో అందుబాటులో లేని అసాధారణ నైపుణ్యాలు ఉన్నవారినే విదేశాల నుంచి నియమించుకునేలా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, వాన్స్ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ ట్రంప్ ప్రభుత్వం



బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను
## టార్గెట్ చేస్తున్నారు

- మోదీ ప్రభుత్వంపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తీవ్ర ఆరోపణలు
- బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై 92 లక్షల ఓట్లు తొలగించాయని వ్యాఖ్య
- ప్రజాస్వామ్యాన్ని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతాది 2లో

## సీఎం అయ్యాక నన్ను స్టింగ్ ఆపరేషన్‌తో ఇరికించే ప్రయత్నం..

- తన వద్ద ఫొటోలు, పత్రాలు ఉన్నాయని వెల్లడి
- పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ప్రకటన
- స్టింగ్ వెనుక ఉన్నవారు ఎవరో తెలుసన్న సీఎం
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- తనతో పాటు మరికొందరిపై స్టింగ్స్ జరుగుతున్నాయని ఆరోపణ



కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు చేశారు. తాను సీఎం అయిన తర్వాత తనను స్టింగ్ ఆపరేషన్‌లో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు, పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో తనకు తెలుసని అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడిన శివకుమార్.. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత కొందరు వ్యక్తులు తనను కలిశారని చెప్పారు. వారెవరో,

మిగతాది 2లో

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారు: అనిత

-పర్చూరు నియోజకవర్గంలో పర్యటించిన అనిత



2లో

# సీఎం అయ్యాక నన్ను స్టింగ్ ఆపరేషన్‌తో ఇరికించే ప్రయత్నం..

ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత కొందరు వ్యక్తులు తనను కలిశారని చెప్పారు. వారెవరో, ఎవరి కోసం వచ్చారో తనకు తెలుసన్నారు. "నన్ను ఇరికించేందుకు ప్రయత్నం చేశారు. నా వద్ద ఫొటోలు ఉన్నాయి. ఈ స్టింగ్ ఆపరేషన్ల వెనుక ఉన్న వ్యక్తి ఎవరో నాకు తెలుసు" అని పేర్కొన్నారు.
ఈ వ్యవహారంపై పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు శివకుమార్ వెల్లడించారు. తనను కలిసిన వ్యక్తులకు సంబంధించిన పత్రాలను భద్రపరిచినట్లు చెప్పారు. అయితే ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడు బయటపెట్టలేనన్నారు.
"వాళ్లు ఏం మాట్లాడేందుకు వచ్చారు? ఎలా వచ్చారు? ఎవరిని కలిశారు? అన్నీ నాకు తెలుసు. దీని వెనుక ఎవరు ఉన్నారో కూడా తెలుసు" అని శివకుమార్ అన్నారు.
ప్రభుత్వ అధికారులను కూడా ఇలాంటి ఉచ్చుల్లోకి లాగవచ్చని హెచ్చరించిన ఆయన.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. తన చుట్టూ మూడు స్థాయిల్లో వ్యక్తులు ఉంటారని, కొందరిని ప్రత్యేకంగా నియమించినట్లు తనకు సమాచారం ఉందని ఆరోపించారు.
తనపైనే కాకుండా మరికొందరిపైనా స్టింగ్ ఆపరేషన్లు జరుగుతున్నాయని శివకుమార్ ఆరోపించారు. వాటి వెనుక ఎవరు ఉన్నారు? వాటికి నిధులు ఎవరు సమకూరుస్తున్నారు? అన్న సమాచారం తన వద్ద ఉందని చెప్పారు. తన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు.
కాంగ్రెస్ మంత్రులను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్లు జరిగే అవకాశం ఉందని ఇటీవల కేబినెట్ సమావేశంలో శివకుమార్ హెచ్చరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శివకుమార్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి హెచ్.డీ. కుమారస్వామి ప్రశ్నలు లేవనెత్తారు. కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర కూడా కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించి వాటితో వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేయడం కాంగ్రెస్‌కు గతంలోనూ అలవాటేనని ఆరోపించారు. బీజేపీ నేత ఆర్. అశోక్ కూడా శివకుమార్ గతంలో ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్నందుకే ఇప్పుడు ఆందోళన చెందుతున్నారని విమర్శించారు.

# హెచ్-1బీ వీసాలపై వాన్స్ ఫైర్!

ఈ నేపథ్యంలో, వాన్స్ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ ట్రంప్ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. భారత్‌కు చెందిన ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్‌తో పాటు కాగ్నిజెంట్, క్యాప్‌జెమినీ వంటి ఆరు ప్రధాన ఔట్‌సోర్సింగ్ కంపెనీలను పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కంపెనీల నుంచి కొత్తగా వచ్చే పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తులను స్వీకరించడం, పెండింగ్‌లో ఉన్నవాటిని ప్రాసెస్ చేయడం నిలిపివేస్తున్నట్లు కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్‌లింగ్ తెలిపారు.
విదేశీ ఉద్యోగులు బానిసలుగా మారుతున్నారు
జేడీ వాన్స్ మాట్లాడుతూ, "అత్యంత ప్రతిభావంతులను, అమెరికాలో భర్తీ చేయలేని ఉద్యోగాల కోసం విదేశీయులను తీసుకురావడానికి హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను ఉద్దేశించారు. కానీ దురదృష్టవశాత్తు, కొన్ని దశాబ్దాలుగా ఈ కార్యక్రమం మోసపూరితంగా మారింది" అని ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్ సంస్థలు, అమెరికన్ కంపెనీలు కలిసి అమెరికన్ల కంటే తక్కువ జీతాలకు విదేశీ ఉద్యోగులను నియమించుకోవడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వాన్స్ విమర్శించారు.
"ఈ వీసా మోసంలో అమెరికన్ కార్పొరేషన్ల కన్నా ఈ విదేశీ సంస్థలదే ఎక్కువ బాధ్యత. హెచ్-1బీ వీసాపై వచ్చిన ఉద్యోగులు, అదే స్థాయి అమెరికన్ ఉద్యోగుల కన్నా ఏటా సుమారు 20,000 డాలర్లు తక్కువ సంపాదిస్తున్నారు. అదే విదేశీ ఔట్‌సోర్సింగ్ సంస్థల ద్వారా వస్తే, ఆ వ్యత్యాసం 48,000 డాలర్లకు చేరుకుంటోంది" అని ఆయన వివరించారు.
యజమానులు విదేశీ ఉద్యోగుల బలహీనతను ఆసరాగా చేసుకుంటున్నారని వాన్స్ అన్నారు. ఉద్యోగం కోల్పోతే అమెరికాలో ఉండే అవకాశం ప్రమాదంలో పడుతుందనే భయంతో ఉద్యోగులు యజమానుల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నారని, వారిని "విదేశీ బానిసలు"గా వాడుకుంటూ లేబర్ ఖర్చులను తగ్గించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మైక్రోసాఫ్ట్ సంస్థ 6,000 మంది అమెరికన్ ఉద్యోగులను తొలగించి, అదే సమయంలో 6,300 హెచ్-1బీ వీసాలు, దాదాపు 3,000 గ్రీన్ కార్డుల ద్వారా లబ్ధి పొందిందని ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు.
వీసా దరఖాస్తుల్లో కంపెనీలు తప్పుడు సమాచారం ఇస్తున్నాయని, సాధారణ ఉద్యోగాలకు కూడా అత్యంత ప్రత్యేక నైపుణ్యాలు అవసరమని చూపిస్తున్నాయని, ఇదే అసలైన మోసమని వాన్స్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో హెచ్-1బీ దరఖాస్తుల ఫీజులను పెంచడాన్ని ఆయన సమర్థించారు. నిజంగా ప్రతిభావంతులు కావాలనుకునే కంపెనీలు ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎలాన్ మస్క్, ఏఎండీ సీఈవో లిసా సూ వంటి ప్రతిభావంతులను అమెరికా స్వాగతిస్తుందని, కానీ అమెరికన్ల ఉద్యోగాలను దెబ్బతీసే వారిని కాదని తెలిపారు. ప్రస్తుత అధికారాలతోనే మోసాలను అరికడతామని, అదే సమయంలో హెచ్-1బీ ప్రోగ్రామ్‌లో సంస్కరణలు తీసుకురావాలని కాంగ్రెస్‌ను కోరారు.

# సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి.. సుప్రీంకోర్టులో పిటిషన్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియకు సంబంధించి తీసుకువచ్చిన 2023 చట్టాన్ని సైతం ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ముఖ్యంగా కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని పిటిషనర్ తీవ్రంగా తప్పుబట్టారు.
మరోవైపు, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ అంతిమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా మార్పు ఉండదని, అందుకే ఆ వివాదాస్పద ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది.

# ఓటు చోరీపై ఢిల్లీలో రేవంత్ నిరసన!

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు.
ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ.. రూ.22.6 లక్షల కోట్లు సమీకరించాం: సీఎం

ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, అమరావతిలో క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ ఎకోసిస్టమ్స్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో ఏపీని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నామని అన్నారు.
"వేగం, విస్తరణ, స్థిరత్వం చోదకాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వాములు కండి. రాష్ట్ర ప్రగతిలో పాలుపంచుకోండి" అని ప్రపంచ వ్యాపార నాయకులను, పెట్టుబడిదారులను చంద్రబాబు కోరారు. విశాఖ సదస్సు ఏపీ అభివృద్ధి ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.
చంద్రబాబు పూర్తి ప్రసంగం ఇదిగో..
వేదికను అలంకరించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రివర్యులు శ్రీ పియూష్ గోయల్ గారికి, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (ఙ××) ప్రతినిధులకు, దేశ విదేశాల నుంచి విచ్చేసిన పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు, మిత్రులకు, మీడియా ప్రతినిధులకు అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు.
ఈ రోజు మనం 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు - 2026 కర్టెన్ రైజర్ కార్యక్రమం కోసం ఇక్కడ, దేశ రాజధాని ఢిల్లీలో సమావేశమయ్యాం. ఇది కేవలం ఒక సదస్సుకు నాంది పలకడం మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును, దాని ప్రగతి ప్రస్థానాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ఒక గొప్ప అవకాశం. ఈ వేదికపై నుంచి, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ఎలా ఒక గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా మారబోతోందో వివరించడానికి నేను మీ ముందుకు వచ్చాను.
గతంలో మనం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' గురించి ఎక్కువగా మాట్లాడుకునేవాళ్లం. సులభతర వాణిజ్య విధానాలు, అనుమతులు అనేవి ఒకప్పుడు మన లక్ష్యాలు. కానీ, ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఆ దశను దాటి ముందుకు వెళ్తోంది. మేము ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే కొత్త మంత్రాన్ని అనుసరిస్తున్నాం. అంటే, కేవలం వ్యాపారం చేయడం సులభం చేయడమే కాదు, అత్యంత వేగంగా, సాంకేతికతను జోడించి, పారదర్శకంగా పనులు పూర్తి చేయడం. టెక్నాలజీ ఆధారిత పాలనతో ప్రతి అడ్డంకినీ తొలగించి, పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నాం. సమయం విలువైనది. అందుకే, మీ సమయాన్ని మేం గౌరవిస్తాం. మీ ప్రాజెక్టులు ఎంత వేగంగా కార్యరూపం దాల్చితే, రాష్ట్రం అంత వేగంగా అభివృద్ధి చెందుతుంది.
మా మాటలకు, చేతలకు ఉన్న తేడాను గణాంకాలే రుజువు చేస్తాయి. 2024 జూన్ లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, కేవలం కొద్ది నెలల కాలంలోనే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూ.22.6 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టులతో ఒక బలమైన ఇన్వెస్ట్‌మెంట్ పైప్‌లైన్‌ను నిర్మించింది. ఇది మా ప్రభుత్వంపై, మా విధానాలపై పెట్టుబడిదారులకు ఉన్న అపారమైన నమ్మకానికి నిదర్శనం. ఈ పెట్టుబడుల ద్వారా మన రాష్ట్ర యువతకు దాదాపు 7.1 లక్షల ఉద్యోగాలు సృష్టించే సత్తా మాకుంది. ఇది కేవలం ఒక ఆరంభం మాత్రమే. రాబోయే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలను పూర్తిగా మార్చి, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపాలన్నదే మా సంకల్పం.
మేము కేవలం సంప్రదాయ రంగాలపైనే దృష్టి పెట్టడం లేదు. భవిష్యత్తును అందిపుచ్చుకునేలా, వినూత్నమైన, ప్రపంచస్థాయి ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నాం. ప్రతి రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నాం. కొన్ని ఉదాహరణలు మీ ముందు ఉంచుతాను.
కర్నూలు జిల్లా ఓర్వకల్లులో మేము ఒక 'డ్రోన్ సిటీ'ని నిర్మించబోతున్నాం. ఇది కేవలం డ్రోన్లను తయారుచేసే ఫ్యాక్టరీ కాదు. అదొక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థ. డ్రోన్ టెక్నాలజీపై పరిశోధన మరియు అభివృద్ధి (=ఙణ), పైలట్లకు శిక్షణ, తయారీ, మరియు వివిధ రంగాలలో డ్రోన్ల వినియోగం... ఇలా అన్నింటికీ అది కేంద్రంగా ఉంటుంది. వ్యవసాయం, మైనింగ్, లాజిస్టిక్స్, నిఘా వంటి రంగాలలో డ్రోన్ల సేవలను విస్తృతం చేస్తాం. అలాగే, ఒకప్పుడు కరవు పీడిత ప్రాంతంగా పేరున్న రాయలసీమను 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'గా మార్చాలన్నది మా కల. అక్కడి నేల, వాతావరణం, కష్టపడి పనిచేసే రైతులు... వీటన్నింటినీ ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానం చేస్తాం. అత్యాధునిక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ చైన్ నెట్‌వర్క్‌లు, నాణ్యమైన విత్తనాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి, అక్కడి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసి, రాయలసీమ ఉత్పత్తులను ప్రపంచానికి రుచి చూపిస్తాం. ఇక, మా కలల రాజధాని అమరావతి. అది కేవలం పరిపాలనా రాజధాని కాదు. అది ఒక నాలెడ్జ్ హబ్. భవిష్యత్ టెక్నాలజీలకు కేంద్రం. అమరావతిలో ఒక 'క్వాంటం వ్యాలీ'ని ఏర్పాటు చేయబోతున్నాం. ఇక్కడ క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి అత్యంత అధునాతన రంగాలలో ప్రపంచస్థాయి పరిశోధనలకు, ఆవిష్కరణలకు వేదికగా నిలపబోతున్నాం. ప్రపంచంలోని మేధావులను, శాస్త్రవేత్తలను ఆకర్షించి, అమరావతిని ఒక విజ్ఞాన నగరంగా తీర్చిదిద్దుతాం. ఇక పర్యావరణహిత ఇంధనాల విషయానికి వస్తే, ఆంధ్రప్రదేశ్ 'గ్రీన్ హైడ్రోజన్' పర్యావరణ వ్యవస్థల నిర్మాణంలో కీలక పాత్ర పోషించనుంది. మాకున్న సువిశాల తీరప్రాంతం, సౌర, పవన విద్యుత్ వనరులు దీనికి గొప్ప బలం. ఈ బలాన్ని ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, ఎగుమతిలో దేశంలోనే అగ్రగామిగా నిలవాలన్నది మా లక్ష్యం. ఇది పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా, రాష్ట్రానికి ఆర్థికంగా ఎంతో మేలు చేస్తుంది.

# ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి.. బస్టాప్‌లో 33 మంది పౌరుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

మరో 18 మంది తీవ్రంగా గాయపడగా, ఈ ఘోర దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఈ దాడి ధాటికి బస్టాప్ పరిసరాలన్నీ రక్తసిక్తమయ్యాయి. మృతదేహాలు, శిథిలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించాయి. ఈ ఏడాదిలో రష్యా జరిపిన దాడుల్లో పౌరులు ఇంత పెద్ద సంఖ్యలో మరణించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ తీవ్రంగా స్పందించారు. రష్యా ఉద్దేశపూర్వకంగానే పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ ఘాతుకానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. "ఇది ముమ్మాటికీ ఉగ్రవాద చర్య. దీనికి తగిన ప్రతీకారం తీర్చుకుంటాం" అని ఆయన హెచ్చరించారు. అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్న రష్యాపై అంతర్జాతీయ సమాజం ఒత్తిడి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఘటనతో ఇరు దేశాల మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారు: అనిత

(మొదటి పేజీ తరువాయి)

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఈరోజు పర్యటించారు. పర్యటనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి ఆమె రూ.75 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రూ.3 కోట్ల విలువైన స్త్రీ నిధి రుణాలను, పనిముట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనిత మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించడం శుభపరిణామమని, దీని ద్వారా సుమారు 28 వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలుగుతుందని వివరించారు. "గొడ్డలి పార్టీ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది" అని అనిత అన్నారు. రాష్ట్రంలో గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు 'ఈగల్ టీమ్స్' ఏర్పాటు చేశామని, మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# బీసీలే మా వెన్నెముక.. వారి రిజర్వేషన్లలో రాజీ లేదు: లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ మంత్రి నారా లోకేశ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, న్యాయస్థానం నుంచి తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళతామని తెలిపారు. ఈరోజు ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇటీవల రద్దు చేసిన విషయం తెలిసిందే. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉటంకిస్తూ ఈ తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో లోకేశ్ మాట్లాడుతూ... "తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక. వారి ప్రయోజనాలను కాపాడటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు" అని అన్నారు. రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాకముందే నెల్లూరు మేయర్ అభ్యర్థిని వైసీపీ ప్రకటించడం వారి అవగాహనారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. సుప్రీంకోర్టు నుంచి శుక్రవారం (రేపు) కీలక నిర్ణయం వెలువడవచ్చని ఆశిస్తున్నామని, తీర్పు రాగానే అక్టోబర్‌లోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్నికలు ముగిసిన తర్వాతే కార్పొరేషన్ చైర్మన్ల వంటి నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలకు రిజర్వేషన్ల రొటేషన్ తప్పనిసరిగా చేయాల్సి ఉందని కూడా ఆయన పేర్కొన్నారు.

# బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు: మహేశ్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. "బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి" అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ..

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి



అంశాలపై ప్రధానితో చర్చించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి కష్టాలు తీరతాయని, ఈ బృహత్తర ప్రాజెక్టుపై కేంద్రం దృష్టి సారించాలని చంద్రబాబు కీలక ప్రతిపాదన చేశారు. ప్రధానితో జరిగిన చర్చల్లో భాగంగా, గోదావరి-కావేరి నదుల అనుసంధానం పూర్తయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు సస్యశ్యామలమవుతాయని సీఎం వివరించారు. గతంలో ఎన్డీఏ హయాంలోనే రహదారుల నెట్వర్క్, పవర్ గ్రిడ్ వంటివి సాధ్యమయ్యాయని, అదే స్ఫూర్తితో నదుల అనుసంధానం ద్వారా దేశంలో "వాటర్ గ్రిడ్" ఏర్పాటు చేయాలని సూచించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని, ఈ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించాలని ప్రధానిని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న వ్యవసాయ, ఆర్థిక పరిస్థితులను కూడా చంద్రబాబు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 53 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఇది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు. కరవు నష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే, మదనపల్లెలో ప్రారంభించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు వంటి కార్యక్రమాల గురించి తెలిపారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర సహకారం అందించాలని సీఎం కోరారు. ముఖ్యంగా, రాజధాని అమరావతిలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టే "స్వర్ణాంధ్ర - 2047" విజన్ గురించి కూడా ప్రధానికి వివరించారు. అంతకుముందు, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నందుకు మోదీకి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, నిబద్ధత, దూరదృష్టితో దేశాన్ని ప్రపంచ శక్తిగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు.

## పెరటితోటలపెంపకం పైఅంగన్వాడికేంద్రంలో అవగాహన కార్యక్రమం

దొర్నిపాడు అక్టోబర్ 8 పల్లె వెలుగు న్యూస్ :దొర్నిపాడు మండలంలోని చాకరాజు వేముల




గ్రామంలో అంగన్వాడి 1 వ సెంటర్లో గురువారంపెరటి తోటల పెంపకం, మిల్లెట్స్ గురించి, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల ఆహారం ఎలా తయారు చేసుకోవాలో కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ లక్ష్మీ ప్రియమహిళలకు వివరంగా అవగాహన కల్పించారు. పోషణ మహాకార్యక్రమంలో సూపర్వైజర్ ప్రభాకరమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ సేవలను గర్భవతులుబాలింతలు, తల్లులు ఉపయోగించుకోవాలని తెలిపారు.ప్రిస్కూల్ కార్యక్రమాల గురించి తెలియజేశారు,ఈ పెరటి తోటలపెంపకం అవగాహన కార్యక్రమానికిఅధిక సంఖ్యలోమహిళలు, అంగన్వాడీ టీచర్స్ హాజరయ్యారు,ఈ కార్యక్రమంలోశారద, శ్రావణి, హెల్పర్ సులోచన పాల్గొన్నారు.

## ప్రజా ఆస్తుల పరిరక్షణకు నంద్యాలలో "ప్రజా భిక్షాటన".

-విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చిన అఖిలపక్షం నాయకులు.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం నంద్యాల అఖిలపక్ష



ఐక్యవేదిక ఆధ్వర్యంలో రేపు అనగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గాంధీ చౌక్‌లో "ప్రజా భిక్షాటన" కార్యక్రమం నిర్వహించనున్నట్లు అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి ప్రకటించారు. గురువారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రధాన కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. నూనెపల్లె మార్కెట్ యార్డు భూమిలో రెండు ఎకరాలను రాజకీయ పార్టీకి కేటాయించడాన్ని రద్దు చేయడం, ఆర్ ఏ ఆర్ ఎస్ ప్రాంగణంలోని తాత్కాలిక కలెక్టరేట్‌ను అక్కడి నుంచి తరలించడం ప్రధాన డిమాండ్లుగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు.

రెండు ఎకరాల భూమిని 33 సంవత్సరాలకు కేటాయించడం ద్వారా ప్రభుత్వానికి లభించేది కేవలం ?66,000 మాత్రమేనని పేర్కొంటూ, ఆ ?66,000 మొత్తాన్ని ప్రజల నుంచి భిక్షాటన రూపంలో సమీకరించి ప్రభుత్వానికి అందజేయడం ద్వారా ప్రజా ఆస్తులను కాపాడుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. అదేవిధంగా, ఆర్ ఏ ఆర్ ఎస్ నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను తరలించేందుకు అవసరమైన నిధులను కూడా ప్రజల నుంచి సమీకరించేందుకు కూఅ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నంద్యాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, యువత, కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని "ప్రజా భిక్షాటన" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నిట్టూరు సుధాకర్ రావు, బిజ్జల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



పల్లె వెలుగు న్యూఢిల్లీ. విజయవాడలో జరగనున్న దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0కు ఆహ్వానించేందుకు ఎంపీ శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు రాజ్యసభ ఎంపీ సనా సతీష్ బాబుతో కలిసి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను గురువారం న్యూ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి సాదరంగా ఆహ్వానించడం జరిగిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. బెజవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులతో విజయవాడ దసరా ఉత్సవాలు వైభవంగా జరగాలని ఆకాంక్షిస్తున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

## కోర్టు తీర్పు తర్వాత ఎన్నికలు, బ్యాలెట్ పేపర్ ద్వారానే: ఎస్ ఇ సి.



పల్లె వెలుగు నెల్లూరు జిల్లా. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎస్ ఇ సి అనిలచంద్ర పునేఠా తెలిపారు.

ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి సిద్ధమైన ఓటర్ల జాబితా ఆధారంగానే స్థానిక ఎన్నికలు ఉంటాయని చెప్పారు. బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహిస్తామని, ఇప్పటికే బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామన్నారు. రెండు నెలలుగా ఏర్పాట్లు సాగుతున్నాయని, ఎన్నికలకు అధికారులంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# ఆదోని పురపీఠంపై కల్లుపోతుల రంగన్న కన్ను!

**ఎస్సీ రిజర్వేషన్ ఖరారైతే చైర్మన్ బరిలో సీనియర్ నేత**

**పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావం.. అధిష్టానం ఆశీస్సులపై ధీమా**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో వాణిజ్య కేంద్రంగా 'రెండో ముంబై'గా ఖ్యాతికెక్కిన, శతాబ్దానికి పైగా ఘన చరిత్ర కలిగిన ఆదోని మున్సిపాలిటీ పీఠంపై స్థానిక రాజకీయం వేడెక్కుతోంది. త్వరలో జరగనున్న పురపాలక ఎన్నికల్లో చైర్మన్ పదవి ఎస్సీ వర్గానికి రిజర్వ్ అయ్యే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జోరందుకోవడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కల్లుపోతుల రంగన్న చైర్మన్ రేసులో తాను ముందంజలో ఉన్నట్లు సంకేతాలిచ్చారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్లపై కోర్టు తీర్పుల అనంతరం త్వరలోనే తుది కేటాయింపులు వెలువడే అవకాశం ఉండటంతో, పార్టీ విధేయులైన నాయకులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా దశాబ్దాలుగా పార్టీకి నిబద్ధతతో సేవలు అందిస్తున్న కల్లుపోతుల రంగన్న పేరు ప్రముఖంగా తెరపైకి వచ్చింది.

నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం.. వివాదరహితుడిగా గుర్తింపు

1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే పార్టీ జెండాను భుజానెత్తుకున్న రంగన్న, అంచలంచెలుగా ఎదిగి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. గతంలో ఆయన నిర్వహించిన కీలక బాధ్యతలు:

సహకార రంగంలో సేవలు: 1995 నుంచి 2002 వరకు కర్నూలు జిల్లా కేడీసీసీ బ్యాంక్ (ఖణజజ ధీఅఎ) డైరెక్టర్‌గా, 2002 నుంచి 2005 వరకు డీసీఎంఎస్ (ఉజమీ) డైరెక్టర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించారు.

స్థానిక సంస్థల్లో అనుభవం: గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై వార్డు అభివృద్ధికి పాటుపడటంతో పాటు పట్టణ సమస్యలపై పూర్తి అవగాహన పెంచుకున్నారు.

మచ్చలేని నాయకత్వం: నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా నిస్వార్థ ప్రజాసేవకుడిగా గుర్తింపు పొందారు.

అధిష్టానం గుర్తింపుపై ధీమా

ఆదోని మున్సిపల్ చైర్మన్ పదవి ఎస్సీ వర్గానికి కేటాయిస్తే, పార్టీకి తాను చేసిన దీర్ఘకాలిక సేవలను, నిబద్ధతను పరిగణనలోకి తీసుకుని అధినాయకత్వం తనకు తప్పక అవకాశం కల్పిస్తుందనే విశ్వాసాన్ని రంగన్న వ్యక్తం చేశారు. సుదీర్ఘ అనుభవం, క్షేత్రస్థాయిలో ఉన్న పట్టు ఆదోని పట్టణాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని ఆయన వర్గీయులు, స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కి రానున్న నేపథ్యంలో ఆదోని టీడీపీ రాజకీయాలు రంగన్న ప్రకటనతో మరింత ఆసక్తికరంగా మారాయి.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కురవ సంఘస్తులు..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక గడివేముల మండల బూజునూరు గ్రామంలో కురువ పద్మావతి విరి కుమారుడు గౌతమ్ (23) ప్రమాదంలో మరణించడం వలన విషయం తెలుసుకున్న ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల కురవ సంఘం ప్రధాన కార్యదర్శి రంగస్వామి, అసోసియేట్ ప్రెసిడెంట్ శివన్న, కోశాధికారి చిన్న నాగన్న, ఉపాధ్యక్షుడు ధనుంజయ, కర్నూలు నగర కార్యదర్శి




శ్రీనివాసుల ఆధ్వర్యంలో గురువారం నాడు ఉదయం మృతి చెందిన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపినట్లు జిల్లా కురువ సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె. పాపారాయుడు ( గడివేముల)తెలిపారు. ఈ సందర్భంగా మృతి చెందిన ఆవుల గౌతం (23) తండ్రి సుబ్బారాయుడు నికి దహన సంస్కారాల నిమిత్తం 5000రూ అందజేశారు. తదనంతరం వారు మాట్లాడుతూ కుటుంబాన్ని పోషించే యుక్త వయసు వచ్చినటువంటి గౌతమ్ (23) మృతి చెందడంతో తల్లిదండ్రులు ఎంతో తమ బాధను వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంగం ఆధ్వర్యంలో మృతిని కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక సహాయ సహకారాలు అందించే వరకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి రంగస్వామి, ఉపాధ్యక్షుడు ధనుంజయ,అసోసియేట్ ప్రెసిడెంట్ శివన్న, కోశాధికారి కేసీ నాగన్న ,కర్నూల్ నగర కార్యదర్శి తవుడు శ్రీనివాసుల,తోపాటు జిల్లా సహాయ కార్యదర్శి ఒగ్గు రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.పాపారాయుడు, కురువ సంఘం సభ్యులు యమదండు రమణయ్య, యమదొండు ఎల్లప్ప, బిలకల గూడూరు శ్రీనివాసులు, బాలస్వామి, కురువ శివ, తదితర కురవ సంఘం నాయకులు, పాల్గొన్నారు.

# అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 8: ఆత్మకూరు అటవీ సిబ్బంది సంయుక్తంగా ఈ



వన్యప్రాణుల 72వ వారోత్సవాల సందర్భంగా బండి ఆత్మకూరు అటవీ రేంజి పరిధిలో ఉన్న సింగవరం గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నంద్యాల ప్రాజెక్టు టైగర్ ఉపసంచాలకులు చైతన్య కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పార్లపల్లె పశు వైద్య సహాయ శస్త్ర వైద్యుల సహకారంతో బండి శిబిరాన్ని నిర్వహించారు. పశువుల ఆరోగ్య సంరక్షణ వ్యాధుల నివారణ పోషకాహారం పరిశు భ్రత సకాలంలో పశు వైద్య సేవలు పొందడం వంటి అంశాలపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ రేంజ్ అధికారి నాసిర్ ఝా మాట్లాడుతూ అడవులు వన్యప్రానుల సంరక్షణ, సహజ ఆవాసాల పరిరక్షణ ,ప్రజలు ,వన్యప్రాణుల మధ్య సామరస్య పూర్వక సహజీవనం యొక్క ప్రాముఖ్యత లను గురించి వివరించారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల్లో పశువులను కాపాడటం మానవ వన్య ప్రాణి సంరక్షణ అవకాశాలను తగ్గించడంలో సహజీవనాన్ని ప్రోత్సహించడంలో కీలకమని పేర్కొన్నారు. గ్రామస్తులకు పశు వైద్య సహాయం అందించడం ద్వారా సమాజ సంక్షేమంతో పాటు వన్యప్రాణి సంరక్షణ లక్ష్యాలకు కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. సమాజ భాగస్వామ్యంతో సంరక్షణ కార్యక్రమాలను బలోపేతం చేయడం అటవీ ప్రాంత సమీప గ్రామాలలో సంరక్షణ పై అవగాహన పెంపొందించడం పట్ల అటవీశాఖ నిబద్ధతకు ఈ శిబిరం నిదర్శనమని రేంజర్ పేర్కొన్నారు. పశు వైద్య శిబిరం అనంతరం పశుపోషకులకు అవసరమైన మందులను రేంజర్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బండి ఆత్మకూరు రేంజర్ నాసిర్ ఝా తోపాటు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, బీట్ ఆఫీసర్ ఫక్రుద్దీన్, పశు వైద్యాధికారి జోష్న, అటవీ సిబ్బంది సింగవరం గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డుపై తవ్విన వారిపై కేసు నమోదు

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలో ప్రజాధనంతో నిర్మించిన రహదారులపై గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వంటివి ఎట్టిపరిస్థితుల్లోనూ చేయొద్దని, ఇలాంటి చర్యలకు పాల్పడితే ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ చట్టం, 1994లోని సెక్షన్ 197 ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిస్తున్న విషయం విదితమే.అయితే, నగరంలోని గణేష్ నగర్-2లో షామియానాల కోసం రహదారులపై గుంతలు తవ్విన విషయం గురువారం కమిషనర్ దృష్టికి రావడంతో మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు, పూజా కార్యక్రమాలు, జన్మదిన వేడుకలు, ఇతర శుభకార్యాల నిర్వహణకు షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేసేటప్పుడు రహదారులపై గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వంటి పనులను ఎట్టిపరిస్థితుల్లోనూ చేయొద్దని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.ఒకసారి రహదారిని తవ్వడం వల్ల ఏర్పడే ప్యాచ్‌ల కారణంగా రోడ్డు నాణ్యత దెబ్బతింటుందని, ముమ్ముందు అదే ప్రాంతంలో గుంత మరింత పెద్దదిగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంటుందని, అంతేకాకుండా పదేపదే ప్యాచ్‌లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.లక్షలాది రూపాయలతో నిర్మించిన రహదారులకు నష్టం కలగకుండా షామియానాల కోసం కాంక్రీట్ స్టాండ్లనే ఉపయోగించాలని ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలతో పాటు కార్యక్రమ నిర్వాహకులు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



# మహానందిలో దసరా శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మహానంది, పల్లె వెలుగు మహానంది స్వామివారికి,శ్రీ కామేశ్వరి అమ్మవారికి ఆలయ దీపాలంకార పూజలతో శ్రీ కామేశ్వరి శరన్నవరాత్రి





పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, ఈవో శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ముందుగా శ్రీ మహానందీశ్వర

వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అలంకార మండపంలో శ్రీ కామేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహానందిలో ఈ నెల 11వ తేదీ నుంచి నుండి 20 వరకు శతచండియాగ పూర్వక నవదుర్గాలంకార,శ్రీ చక్రార్చన,సహస్ర

ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మధు, పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ అటవీ శాఖ ధ్యేయం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 8: సంపాద పరిరక్షణ వన్యప్రాణుల సంరక్షణ చేయకుండా అటవీ సమీప గ్రామాల ప్రజలను






వన్యప్రాణుల సంరక్షణను దృష్టిలో ఉంచుకొని అటవీశాఖ అధికారులు పనిచేస్తున్నారని నంద్యాల ప్రాజెక్టు టైగర్ డిడి డాక్టర్ సి చైతన్యకుమార్ రెడ్డి పేర్కొన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా అటవీ ప్రాంతానికి సమీపంలోనున్న గ్రామాలలో పర్యటిస్తూ స్థానిక ప్రజలతో డిడి చైతన్య కుమార్ రెడ్డి ప్రత్యక్షంగా మమేకమయ్యారు. వన్యప్రాణుల సంరక్షణను బలోపేతం చేయడానికి వన్యప్రాణుల చట్టం 1972 ను కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిందని దీని ప్రకారం వన్యప్రాణులను వేటాడటం, వాటి చర్మం లేదా భాగాలను అక్రమంగా రవాణా చేయడం తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కింద నంద్యాల రేంజ్ పరిధి లోని కడమల కాలువ ,బండి ఆత్మకూరు రేంజ్ లోని గాలి చెన్నయ్యపాలెం, నారాయణపురం గ్రామాల్లో ప్రజలకు అటవీ వన్యప్రాణుల సంరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు గ్రామస్తులతో సమావేశమై అటవీ వన్యప్రాణి నేరాల నివారణ సహజవాసాల రక్షణ అక్రమ వేట ఇతర వన్యప్రాణి నేరాలను అరికట్టడం మానవ వణ్యప్రాణి సహజీవనం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అటవీ మరియు వన్యప్రాణుల సంరక్షణలో అటవీ సమీప గ్రామాల ప్రజల సహకారం

భాగస్వామి మద్యంతో కీలకమని అధికారులు ప్రజలకు వివరించారు అడవులు మరియు వన్యప్రాణులను సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటం తో పాటు భవిష్యత్ తరాలకు సహజ వనరులను పరిరక్షించవచ్చని తెలిపారు. అంతరించిపోతున్న అడవి జంతువులు పక్షులు, వృక్షజాలం యొక్క ప్రాధాన్యతను వివరించడం అడవులను నరికివేతను తగ్గించి వన్యప్రాణుల సహజ ఆవాసాలను కాపాడటం భూమి పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండేందుకు ప్రతి జీవి ఎంత ముఖ్యమో అన్న విషయాలపై అవగాహన కల్పించారు. అటవీ సంరక్షణ కేవలం అటవీ ప్రాంతాలకే పరిమితం భాగస్వామ్యులుగా చేసుకొని ప్రజల భాగస్వామ్యంతో అటవీ వన్యప్రాణి సంరక్షణ దిశగా అటవీశాఖ నిరంతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా గ్రామాలలో ఉచిత పశు వైద్య శిబిరాలను

నిర్వహించారు. యువకులకు వాలీబాల్ పోటీలలో నిర్వహించి వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేశారు. అడవుల ప్రాముఖ్యత గురించి పాఠశాలల్లో వ్యాసరచన వకృతపు పోటీలను నిర్వహించి విజేతరైన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వన్యప్రాణులను కాపాడే విషయంలో ప్రజలందరి చేత అటవీశాఖ అధికారులు ప్రతిజ్ఞలు చేయించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల అడవి డివిజన్ కు చెందిన రేంజ్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు బీట్ ఆఫీసర్లు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

---

# చరిత్ర సృష్టించిన అడుగు వికసిత భారత్ వైపు



పల్లె వెలుగు:సేవ అనేది ఒకరి అంతరాత్మ నుండి వచ్చే నిరంతర ప్రవాహంఒక గొప్ప నాయకుడు సమాజ మార్పు కోసం తన జీవితాన్నే ధారపోస్తాడు.గుజరాత్ ముఖ్య మంత్రిగా మొదలై భారత్ ప్రధాన మంత్రిగా సాగుతున్న నరేంద్ర మోడి పాతికేళ్ల ప్రజా జీవితం కేవలం ఒక కాలం కాదు. ఆది భారత దేశ చరిత్రను తిరిగిరాసిన ఒక మహా ప్రస్థానం కోట్లాదిమందిగుండెల్లో ఆశలు నింపిన ఒక నిరంతర శ్రమయాగం.సామాన్యునిగా జీవితం మొదలై అసామాన్య స్థితికి చేరిన ప్రజా నాయకుడు నరేంద్ర మోదీ పేద కుటుంబంలో జన్మించి దేశ భవిష్యత్తును మార్చిన వెలుగు నరేంద్ర మోదీ పాతికేళ్ల నిరంతర ప్రజా సేవాభారతావనికి అందించెను నవ శఖాన్ని కలిగించెను.ప్రజల్లో సరి కొత్త ఆశ జన్ ధన్ ఖాతాతో పేదలకు అండగా నిలిచావుస్వచ్ఛ బారత్ అంటూ ప్రతి ఊరిని మార్చావు.ఉజ్వల కాంతితో పేదరికపు కన్నీళ్ళు తుడిచావు ఆయుష్మాన్ భరోసాతో ఆరోగ్య భాగ్యం ఇచ్చావు.పిఎం కిసాన్ సాయంతోరైతులకు తోడై నిలిచావుడిజిటల్ మంత్రంతో పాలనను ప్రజల వద్దకు తెచ్చావు.మేక్ ఇన్ ఇండియా అంటూ సరికొత్త చరిత్ర సృష్టించావు.ఆత్మనిర్భర నినాదంతో స్వదేశీ శక్తిని పెంచావువందే భారత్ రైళ్ల తో దేశ వేగాన్ని పెంచావు.చంద్రయాన్ గగన్ యాన్ ల తో నింగిని తాకావు జి20 వేదికపై జగత్తుకు నిర్దేశం చేశావు.ప్రపంచదేశాల ముందు భారత్ ను గెలిపించావుఆర్టికల్ 370 రద్దుతో కాశ్మీర్లో మువ్వన్నెల జెండా ఎగిరేశావు.అయోధ్యలో రామయ్య మందిరాన్ని నిలిపావు.సరిహద్దుల్లో శత్రువుల గుండెల్లో సర్జికల్ స్ట్రైక్ వణుకుప్రపంచ వేదికలపై భారత వినిపించే విశ్వ గురువు పలుకు సబ్కా సాత్ సబ్ కా వికాస్ అంటూ ప్రతి భారతీయుడి గుండెల్లో నిలిచావు.కోవిడ్ చీకట్లో కోట్లాది మందికి ఉచిత రేషన్ కాంతిఅభివృద్ధి మంత్రముతో దేశమంతా వెల్లివిరిసిన క్రాంతిజాతి నిర్మాణములో అలుపెరుగని తపోధనుడు మోదీభారత భాగ్య విధాతవై సాగుతున్న యుగకర్త మోదీ పాతికేళ్ల నిరంతర శ్రమకు జోహార్.ఉదేశాన్ని ప్రేమించ డమంటే కేవలం నినాదాలు చేయడం కాదు.దేశ శ్రేయస్సుకై నిరంతరం శ్రమించడం స్వామి వివేకానంద.జాతి నిర్మాణంలో అలుపెరుగక శ్రమిస్తున్న నవ భారతి రూప శిల్పి పాతికేళ్ల ప్రస్థానం భవిష్యత్తు తరాలకు ఒక నిఘంటువు. సంకల్ప బలంతో మోదీ పాలనా నాయకత్వం వికసిత భారత వైపు సాగే నీ ప్రగతి ప్రయాణానికి నీరాజనాలు మీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకు వెళుతుందని ఆశిద్దాం.(భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం ప్రస్తావన గురించి స్పందిస్తూ రాసిన కవిత)

నేదునూరి కనకయ్య
(నేదునూరి కళ్యాణ్)అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం రచయిత కాలమిస్ట్
కరీంనగర్.

# బండి ఆత్మకూరు మండల టెక్నికల్ అసిస్టెంట్ పై సస్పెన్షన్ వేటు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 8: బండి ఆత్మకూరు మండలంలో వి బి జి రామ్ జి లో టెక్నికల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న అభిషేకం రాజు పై సస్పెన్షన్ వేటు వేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్టుగా తెలుస్తోంది. ఉపాధి పనులకు సంబంధించి వాటిని నిర్వహించడంలో అవసరమైన ప్రక్రియను సక్రమంగా నిర్వర్తించకపోవడంతో కూలీలకు తగిన స్థాయిలో ఉపాధి పనులను కల్పించకపోవడంతో డ్వామా పిడి చర్యలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. జిల్లాలో చాలామంది టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి పనుల నిర్వహణలో బాధ్యతారహితంగా వ్యవహరించినట్లు గా తాజా సమాచారం. టెక్నికల్ అసిస్టెంట్లు విధి నిర్వహణలో ఈ విధంగా వ్యవహరిస్తూ ఉంటే సంబంధిత అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఏం చేస్తున్నారన్నది చర్చకు దారితీస్తూ ఉంది. ఈ విషయంపై జిల్లా అధికారులు దృష్టి సారించి టెక్నికల్ అసిస్టెంట్ల పనితీరుపై పర్యవేక్షించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ల పట్ల చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు

# కిశోర బాలికల (కౌమార దశలోని బాలికల) కోసం అవగాహన కార్యక్రమం..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా గడివేముల మండలం మండల మహిళా సమైక్యలో ప్రభుత్వ వైద్య సిబ్బంది ప్రభుత్వం మరియు (ఐసిడిఎస్ ) ఆధ్వర్యంలో ఆరోగ్యము,



విద్య మరియు రక్షణ తదితర ముఖ్యమైన అంశాలపై అవగాహన కార్యక్రమం పైన గడివేముల పొదుపు లక్ష్మి ఆఫీస్ నందు ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధికారులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ ఏపీలో "కిశోరి వికాసం" వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా గ్రామస్థాయిలో సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమైన అంశాలు.... లి ఆరోగ్యం – పోషణ: రక్తాన్ని పెంచే పౌష్టికాహారం తీసుకోవడం, రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం. లి విద్యపై దృష్టి: బాలికలు మధ్యలో బడి మానేయకుండా ఉన్నత విద్యపై దృష్టి పెట్టడం. లి దుష్పరిణామాలు: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన నష్టాల గురించి అవగాహన. లి భద్రత – హక్కులు: బాలికల రక్షణ చట్టాలు, మానసిక ఆరోగ్యం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం పలు అంశాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గడివేముల ప్రభుత్వ ఆరోగ్య వైద్య సిబ్బంది ఏఎన్ఎం మేడం అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్లు ఏపిఎం జ్యోతి, సీసీలు, బాలికలు,పాల్గొన్నారు,

# ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షునికి సన్మానం

బనగానపల్లె, అక్టోబర్ 8, పల్లెవెలుగు బనగానపల్లె పట్టణంలోని ఆంజనేయ స్వామి



దేవస్థానంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన జి.మద్దయ్య యాదవ్ ను సన్మానించారు. గురువారం పట్టణంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో అఖిలభారత యాదవ మహాసభ బనగానపల్లె మండల అధ్యక్షులు ఘన మద్దిలేటి యాదవ్ ,ప్రధాన కార్యదర్శి శంకర్ యాదవ్ ల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు యాదవ సంఘం నాయకులు మద్దయ్య యాదవ్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. తమ పిల్లలను ఉన్నత చదువు చదివించుకోవాలన్నారు . విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని విద్యతోనే యాదవుల అభివృద్ధి సాధ్యమన్నారు. యాదవులు ఐకమత్యంతో తమకు రావాల్సిన రాయితిలు, హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివ కృష్ణ యాదవ్, సిపిఐ మండల కార్యదర్శి శివయ్య, యాదవ సంఘం నాయకులు బాల వీరభద్రుడు యాదవ్, చౌడం శ్రీనివాసులు యాదవ్, పలుకురు పుల్లయ్య యాదవ్, చీరాల వెంకటేశ్వర్లు యాదవ్ ,రామచంద్రుడు యాదవ్, నందవరం ఎన్ .బాల వెంకటేశ్వర్లు యాదవ్ ,శీలమన్న యాదవ్, వై .బాల వెంకటేశ్వర్లు యాదవ్ ,కుమారస్వామి యాదవ్, పవన్ కుమార్ యాదవ్, క్రిష్ణగిరి రంగస్వామి యాదవ్, డాక్యుమెంటు రైటర్ మల్లేశ్వరుడు యాదవ్, పసుపల నాగరాజు యాదవ్, డోల్లు మహేష్ యాదవ్, పత్తెనగరం వెంగన్న యాదవ్, ఎల్లా కృష్ణుడు యాదవ్, దాట్ల జానకిరామ్ యాదవ్, ఎల్ఐసి శ్రీరాములు యాదవ్, మంగంపేట రమణ యాదవ్ ,బలరాం యాదవ్, బాల ఆంజనేయులు యాదవ్, రామ వెంకటేశ్వర్లు యాదవ్ వేములపాడు సుధాకర్ యాదవ్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# 23వ రోజుకు చేరిన వీఆర్ఏల నిరవధిక ధర్నా

బనగానపల్లె, అక్టోబర్ 8, పల్లెవెలుగు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వీఆర్ఏలు చేస్తున్న నిరవధిక ధర్నా 23వ రోజుకు చేరుకుంది గురువారం పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదురుగా వీఆర్ఏలు చేస్తున్న నిరవధిక సమ్మె 23వ రోజుకు చేరుకుంది.తమ సమస్యలను పరిష్కరించాలని 23 రోజులుగా నిరవధిక ధర్నా కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని వీఆర్ఏలు కోరుతున్నారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం అధ్యక్షులు గౌస్ పీరా మాట్లాడుతూవీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీ వీఆర్ఏలందరికీ ఒకేసారి ఉద్యోగ నియామకాలు కల్పించాలన్నారు.అర్హులైన వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన వీఆర్ఏల కుటుంబ సభ్యులకు వయోపరిమితి లేకుండా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సమస్యలను వాయిదా వేయకుండా సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం చూపే వరకు నిరవధిక ధర్నా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘ నాయకులు టి.సుబ్రహ్మణ్యం, కె.హరిబాబు,టి.బాలకృష్ణ, టి.ప్రసాద్,శేషు,మనోహర్, వీఆర్ఏలు పాల్గొన్నారు.



# బనగానపల్లెలో సోలార్ వినియోగం పై విద్యుత్ శాఖ అధికారుల అవగాహన...

బనగానపల్లె, అక్టోబర్ 8,పల్లెవెలుగు పీఎం సూర్య ఘర్ కార్యక్రమంలో భాగంగా సేవ సేతు అభియాన్ అనే కార్యక్రమాన్ని బనగానపల్లె పట్టణంలోని స్థానిక సబ్ డివిజన్ కార్యాలయం




లో విద్యుత్ శాఖ అధికారులు ఏడి మద్దిలేటి,ఏఈ శ్రీనివాసులు ల ఆధ్వర్యంలో సోలార్ వినియోగంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ వాడడం వల్ల విద్యుత్ బిల్లు తగ్గుతుంది మీ కుటుంబ ఖర్చులో ఆదా పర్యావరణానికి మేలు ప్రత్యక్ష శక్తి వినియోగం నిరంతరం విద్యుత్ సరఫరా దీర్ఘకాలిక ప్రయోజనం తక్కువ ఖర్చుతో సంస్థాపన ప్రభుత్వ సహాయంతో 25 సంవత్సరాల పనరి తీరు పరిమితి 10 సంవత్సరాల వారంటి ఉంటుంది.ఇంటికి సొంత సౌర విద్యుత్ శుభ్ర శక్తి సురక్షిత భవిష్యత్తు అలాగే ఒక కిలో వాట్స్ కి 30 వేల రూపాయలు అలాగే రెండు కిలో వాట్స్ కి 60,000 రూపాయలు,మూడు కిలో వాట్స్ కి 78,000 ప్రభుత్వ సబ్సిడీ ఉంటుందని అని అన్నారు. బనగానపల్లె మండలంలో చాలాచోట్ల సోలార్ అమర్చడం జరిగిందని కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లైన్మెన్ లు షబ్బీర్,నాయక్,జమాల్,రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి- బిసి ఇందిరా

బనగానపల్లె , అక్టోబర్ 8,పల్లెవెలుగు బనగానపల్లెను ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా






తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి నియోజకవర్గ నాయకురాలు బిసి ఇందిరా రెడ్డి పిలుపునిచ్చారు గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెల్కమ్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి ప్రమీల అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిసి ఇందిరా మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గాన్ని కాలుష్య రహిత, ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడంలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు, ప్రజల్లో ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు.కళాశాల ఆవరణలో పరిసరాల్లో ప్లాస్టిక్ వస్తువుల విక్రయాన్ని నిషేధించాలన్నారు . విద్యార్థులు తమ ఇళ్లలో కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని కోరారు. కళాశాల అభివృద్ధికి తన సహకారం నిరంతరం కొనసాగుతుందని, కళాశాలకు అవసరమైన కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం సాధించవచ్చు అన్నారు విద్యార్థులు తమ చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మంచి ఫలితాలు సాధించాలన్నారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ నీతమ్మ,తెలుగు అధ్యాపకులు డాక్టర్ లక్ష్మమ్మ, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

# వీఆర్ఏల సమ్మె.. హామీలు అమలు చేయాలని డిమాండ్

పోరుమామిళ్ల, అక్టోబర్ 8 ( పల్లె వెలుగు):గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలను తక్షణమే పరిష్కరించి, తమ న్యాయమైన డిమాండ్లకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ వీఆర్ఏలు చేపట్టిన శాంతియుత సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి సంఘ నాయకులతో చర్చలు జరిపి న్యాయం చేయాలని పోరుమామిళ్ల మండల వీఆర్ఏల సమితి కోరింది. 2024 ఎన్నికల ముందు పాదయాత్రలు, బహిరంగ సభల్లో వీఆర్ఏల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. నారా లోకేష్, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వీఆర్ఏలకు కేవలం రూ.10,500 వేతనం మాత్రమే అందుతోందని, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో రూ.24 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనాలు ఉన్నాయని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం అందించడంతో పాటు వేతనాలు పెంచి తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండల అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నారాయణ, హరికృష్ణ, వరాలు తదితర వీఆర్ఏలు పాల్గొన్నారు.



# కేజీబీవీకి ఉచితంగా ఆర్వోప్లాంట్ ఏర్పాటు,,

నందవరం పల్లె వెలుగు అక్టోబర్ 8 నందవరం




కేజీబీవీ పాఠశాలలో ఏపీసీ లోక్‌రాజ్ సహకారంతో ఉచితంగా ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ది కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్‌ను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.
ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్‌లు తిరుమల నాయుడు,చెన్నప్ప గురువారం పాఠశాలను సందర్శించారు.ఆర్వో ప్లాంట్ ఏర్పాటు విషయమై ప్రిన్సిపల్ శైలజ,విద్యా కమిటీ చైర్మన్ భీమన్నతో చర్చించారు. అనంతరం ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శైలజ మాట్లాడుతూ ఏపీసీ లోక్‌రాజ్ సహకారంతో పాఠశాలకు ఉచిత ఆర్వో ప్లాంట్ మంజూరైనట్లు తెలిపారు.జిల్లాలోని 26 మండలాల్లో ఐదు మండలాలకు చెందిన కేజీబీవీలకు ఉచిత ఆర్వో ప్లాంట్లు మంజూరు కాగా, అందులో నందవరం కేజీబీవీ ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపల్ శైలజ,విద్యా కమిటీ చైర్మన్ భీమన్న, ఉపాధ్యాయులు,విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఏపీసీ లోక్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.నందవరం కేజీబీవీకి ఆర్వో ప్లాంట్ కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప ఏపీసీ దృష్టికి తీసుకెళ్లారని శైలజ తెలిపారు.పాఠశాల అభివృద్ధికి రంగప్ప చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.బాలికలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చిన ది కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ హైదరాబాద్ బృందానికి పాఠశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర సర్వీసు కూడా అందిస్తామని తెలిపారు. ప్రతి నెలా తమ టెక్నీషియన్ పాఠశాలను సందర్శించి ప్లాంట్ పనితీరును పరిశీలిస్తారని, ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరిస్తారని పేర్కొన్నారు.కొద్దిరోజుల సమయంలోనే ఆరో ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా స్టీల్ వాటర్ బాటిల్ పంపిణీ చేస్తామని తెలిపారు.

# తొలగించిన ఓటర్ల జాబితాలో ప్రతి పేరును క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించాలి.

**● అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదు. ● పొరపాటున తొలగించిన అర్హులైన ఓటర్లకు ఫారం-6 నమోదులో సహకరించాలి. ● ఎస్ ఐ ఆర్-2026 ఓటర్ల జాబితా పునఃధృవీకరణను పకడ్బందీగా చేపట్టాలి. ● జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్)-2026లో భాగంగా తొలగించిన ఓటర్ల వివరాలను బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి క్షుణ్ణంగా పునఃపరిశీలించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, అనర్హుల పేర్లు ఓటర్ల జాబితాలో లేకుండా పారదర్శకంగా, తప్పులు లేని జాబితాను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

కలెక్టర్ ప్రధాన ఆదేశాలు:

1)తొలగించిన 1,81,545 మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పునఃధృవీకరించాలి.

2)మరణం, శాశ్వత వలస, ఆచూకీ లభించకపోవడం, బహుళ నమోదు తదితర కారణాలతో తొలగించిన ప్రతి పేరును నిశితంగా పరిశీలించాలి.

3)అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగించబడినట్లు గుర్తిస్తే, వారికి ఫారం-6 సమర్పణలో సహకరించి, నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో తిరిగి నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

4)కొత్తగా 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలి.



5)ఓటర్ల జాబితా పునఃధృవీకరణలో ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చురుకుగా సహకరించేలా చర్యలు చేపట్టాలి.

1,81,545 మంది ఓటర్ల వివరాలపై పునఃపరిశీలన

భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన "అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు నమోదు కావాలి.. అనర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా ఓటర్ల జాబితాలో ఉండకూడదు" అనే లక్ష్యానికి అనుగుణంగా ా×=–2026 గణన దశలో 2026 జూన్ 15 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మరణం, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడం, ఆచూకీ లభించకపోవడం, ఒకటికంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదై ఉండటం తదితర కారణాలతో 1,79,506 మంది ఓటర్లు కేటాయించిన చిరునామాల్లో అందుబాటులో లేనట్లు గుర్తించారు. గణన ప్రక్రియ అనంతరం 2026 జూలై 31న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 12,25,937 మంది ఓటర్లు ఉన్నారు. అనంతరం నోటీసుల ప్రక్రియలో భాగంగా అక్టోబరు 6 నాటికి మరో 2,039 మంది ఓటర్లు అనర్హులుగా గుర్తించబడ్డారు. ఈ నేపథ్యంలో మొత్తం 1,81,545 మంది ఓటర్ల వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

పునఃధృవీకరణలో భాగంగా పొరపాటున ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన అర్హులైన వ్యక్తులకు ఫారం-6 సమర్పించేందుకు సహాయం అందిస్తారు. సంబంధిత వివరాలను పరిశీలించి, నిబంధనల మేరకు నిరంతర నవీకరణ ప్రక్రియలో వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్-2026లో భాగంగా తుది ఓటర్ల జాబితాను అక్టోబరు 16, 2026న ప్రచురించనున్నారు. తుది జాబితాలో పేరు లేని అర్హులైన వ్యక్తులు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి సంవత్సరం జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబరు 1 తేదీలను ఓటరు నమోదుకు అర్హత తేదీలుగా పరిగణిస్తారు. 2027 జనవరి 1 అర్హత తేదీగా వార్షిక సంక్షిప్త సవరణ ప్రక్రియ కూడా నిర్వహించబడుతుంది.

ఓటర్ల జాబితా పునఃధృవీకరణ ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా సహకరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు.

# రజకుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రజక విభాగం తన సేవలను గుర్తించి రజక విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా ఆల్వకొండ మద్దిలేటి ఎంపిక అయ్యారు.



నంద్యాలజిల్లా రజకుల సంక్షేమంకోసం,హక్కులు,రాయితీలు కోసం,అభ్యున్నతి కోసం దశాబ్దాలుగా నిరంతరం పోరాడుతూ, రజకుల సమస్యలపై న్యాయపోరాటాలు చేసి రజకులకు నిరంతరం సేవలు చేస్తూ రజకులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలానే చాకిరేవు కాదు చదువుకుందాం, అన్ని రంగాలలో అభివృద్ధి చెందేందుకు, రజకులను చైతన్యం చేయడం, చాలీచాలని వేతనాలతో, వేతనాలు పెంచమంటే గ్రామ బహిష్కరణలు, రజక మహిళలపై లైంగిక వేధింపులు, సమాజంలో చిన్న చూపుకు గురవుతూ రజకులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ఆలవ కొండ మద్దిలేటి రజక సొసైటీలో గ్రామ గ్రామాన ఏర్పాటు చేసి వారి అభ్యున్నతకు కృషి చేశారు. ఇతని సేవలను గుర్తించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రజక విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేయడంపై రజక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా స్థాయి వరకు రజకులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు, అన్యాయాలు, దౌర్జన్యాలపై చిన్నమద్దిలేటి నిరంతరం స్పందిస్తూ రజకులకు అండగా నిలుస్తున్నారని నాయకులు తెలిపారు. రజకుల హక్కుల పరిరక్షణతో పాటు వారి ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యాపరమైన అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ సేవలను గుర్తించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అలవ కొండ మద్దిలేటిని నంద్యాల జిల్లా రజక విభాగం అధ్యక్షుడిగా నియమించడం పట్ల రజక సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలవ కొండ మద్దిలేటి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, బనగానపల్లె నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి, నంద్యాల మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆళ్లగడ్డ గంగుల ప్రభాకర్ రెడ్డి లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

గతంలో రజకుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించామని, ప్రస్తుతం తనపై మరింత బాధ్యత పెరిగిందని అలవ కొండ మద్దిలేటి అన్నారు. రజకుల అభ్యున్నతితో పాటు పార్టీ అభివృద్ధి, పార్టీ శ్రేయస్సు కోసం తన శక్తి మేరకు, ఎలాంటి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

రజకులలో ఐక్యతను పెంపొందించి, యువత విద్య, ఉపాధి అవకాశాల వైపు ముందుకు సాగేందుకు కృషి చేస్తానని, రజకుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవకాశాలపై అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మిడ్తూరు మండలం చెరుకు చెర్ల గ్రామానికి చెందిన రజక మహిళపై దాడి చేయడం అమానుషమని సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. బాధితులకు న్యాయం జరగకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని ఆయన పేర్కొన్నారు.

అలవ కొండ మద్దిలేటి నంద్యాల జిల్లా రజక విభాగం అధ్యక్షుడిగా ఎంపికైన సందర్భంగా నంద్యాలలో మడివాల మాచిదేవ రజక విద్యాసేవ సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి రాము ఆధ్వర్యంలో రజక నాయకులు, కార్యకర్తలు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాము, కార్యవర్గ సభ్యులు నాగ శేషు, మధు, సుబ్బరాయుడు, నాగభూషణం, రంగనాయకులు తదితర రజక నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆల్వ కొండ మద్దిలేటికి అభినందనలు తెలిపారు.

"రజకుల హక్కుల కోసం పోరాటం -- రజకుల అభ్యున్నతే లక్ష్యం" అనే సంకల్పంతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# అడవులు వన్య ప్రాణులను కాపాడుకుందాం.

రుద్రవరం. పల్లె వెలుగు : అడవులు వన్య



ప్రాణులను కాపాడుకుందామని రుద్రవరం అటవీ రేంజ్ సబ్ డిఎఫ్ ఓ శ్రీనివాసరెడ్డి, రేంజి ఆఫీసర్ ముర్తుజావలి అన్నారు. గురువారం 72వ వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా రుద్రవరం లోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ ఆధ్వర్యంలో పశువుల వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ మాట్లాడుతూ అడవుల్లో వన్యప్రాణులకు సోకే వ్యాధులు వాటి నివారణ వాటిని ఎలా రక్షించాలి టీకాల ప్రాముఖ్యత అటవీ ప్రాంత సమీపాన ఉన్న గ్రామాల పశువుల కాపరులు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం సబ్ డీఎఫ్ ఓ శ్రీనివాసరెడ్డి, రేంజ్ ఆఫీసర్ ముర్తుజావలి మాట్లాడుతూ
వన్యప్రాణి వారోత్సవాల ఉద్దేశ్యం, అడవులు మరియు వన్యప్రాణుల ప్రాముఖ్యత గురించి వివరించారు. అడవి జంతువుల బారి నుండి తమ పంట పొలాల రక్షణ నిమిత్తం ఏర్పాటు చేసుకునేటువంటి కార్యకలాపాలలో భాగంగా రైతులు పంటపొలాలకు విద్యుత్ తీగలను అమర్చడం,ఉచ్చులు, వలలు మరియు ఇతర అక్రమ వేట పద్ధతుల వల్ల కలిగే నష్టాలపై గ్రామస్థులకు వివరించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, అక్రమ వేటను నిరోధించడం మరియు వన్యప్రాణుల ఆవాసాలను కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వన్యప్రాణి వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన ముత్యాలపాడు, అహోబిలం లో నిర్వహించిన ఏకో ట్రైల్ వాక్ లో గెలుపొందిన విద్యార్థులకు వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు పురస్కారం బహుమతులు అందజేశారు.
ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు పి మాబుఖాన్, జి శ్రీనివాసులు, టీ రామకృష్ణ వి జేమ్స్ పాల్, బీట్ ఆఫీసర్లు ఈ,సురేంద్ర గౌడ్ , నాగ హుస్సేనయ్య , మదన గోపాల్,బిఈ నగేష్ సిబ్బంది ప్రొటెక్షన్ వాచర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు
# పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి.

**పెండింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**
**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. స్థానిక








సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సమయానికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసి, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
గురువారం అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్‌ఓ రాము నాయక్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.
వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని ఆరు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 212 ఎన్నికల వార్డులు, 511 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని స్వయంగా పరిశీలించి భవనాల స్థితిగతులు, తాగునీరు, విద్యుత్, వెలుతురు, మరుగుదొడ్లు, ర్యాంపులు తదితర కనీస సౌకర్యాలను నిర్ధారించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గత ఎన్నికల అనుభవాలు, స్థానిక పరిస్థితులు, శాంతిభద్రతలను పరిగణనలోకి తీసుకుని పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ కేంద్రాలను త్వరగా ఖరారు చేయాలన్నారు.
బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అవసరమైన ప్రింటర్లను గుర్తించి, పోలింగ్ సిబ్బంది వివరాలను సేకరించి సమగ్ర డేటాబేస్ సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ, ఓట్ల లెక్కింపునకు అనువైన రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ముందుగానే గుర్తించాలన్నారు. బ్యాలెట్ పేపర్ల నంబరింగ్, సీలింగ్, స్వస్తిక్ ముద్ర వినియోగం తదితర అంశాలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలతో పాటు పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలకు సంబంధించి కూడా అవసరమైన ఏర్పాట్లు, బ్యాలెట్ బాక్సుల లభ్యత, సిబ్బంది సమీకరణ తదితర అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆదేశించారు.
అంతకుముందు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాలు ముందస్తు సన్నాహాలను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని, పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటు హక్కు వినియోగం, ఎన్నికల విధానాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో యువ ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని చేరవేయడంతో పాటు జిల్లా స్థాయిలో హెల్ప్‌డెస్కులు, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్ల ద్వారా అందించే సేవలపై ప్రచారం చేపట్టాలని, అత్యవసర సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు నియమితులైన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ విజయవంతానికి కృషి చేయాలని ఆదేశించారు.

# నిబంధనల మేరకు పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ.

-19 దుకాణాలకు దరఖాస్తులు.. 16 దుకాణాలకు లాటరీ ద్వారా కేటాయింపు.




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించి గురువారం నంద్యాల కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో లాటరీ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా కేటాయింపునకు నోటిఫై చేసిన 27 మద్యం దుకాణాలకు గాను 19 దుకాణాలకు మాత్రమే దరఖాస్తులు అందగా, నిబంధనల ప్రకారం లాటరీ నిర్వహణకు అర్హత సాధించిన 16 దుకాణాలను దరఖాస్తుదారులకు కేటాయించారు. జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ పర్యవేక్షణలో, అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ ఆర్. హనుమంతరావు సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. నిర్దేశిత నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా లాటరీ ద్వారా అర్హులైన దరఖాస్తుదారులను ఎంపిక చేసి దుకాణాల కేటాయింపు చేపట్టారు.
జిల్లాలో మొత్తం 26 జనరల్ కేటగిరీ మద్యం దుకాణాలతో పాటు గీత కులాలకు కేటాయించిన ఒక దుకాణం కలిపి మొత్తం 27 దుకాణాలకు టెండర్లు ఆహ్వానించారు. వీటిలో 19 దుకాణాలకు దరఖాస్తులు అందగా, మిగిలిన ఏడు దుకాణాలకు ఎలాంటి దరఖాస్తులు అందలేదు. నిబంధనల ప్రకారం నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు అందిన దుకాణాలకు మాత్రమే లాటరీ నిర్వహించగా, ఈ విధానంలో మొత్తం 16 దుకాణాలను కేటాయించారు. బనగానిపల్లెలోని



రెండు దుకాణాలకు ఒక్కో దుకాణానికి ఇద్దరు చొప్పున, కోవెలకుంట్లలోని ఒక దుకాణానికి ఒక్క దరఖాస్తు మాత్రమే అందింది. నిర్దేశిత కనీస సంఖ్యలో దరఖాస్తులు లేకపోవడంతో ఈ మూడు దుకాణాలకు లాటరీ నిర్వహించలేదు. ఈ దుకాణాలకు సంబంధించి తదుపరి చర్యలను ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల మేరకు చేపట్టనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## మహానందిలో వరుణ జపాలు పూర్ణాహుతితో ముగింపు

మహానంది, పల్లె వెలుగు : మహానంది పుణ్యక్షేత్రంలో దేవదాయ శాఖ అధికారుల ఆదేశాల



మేరకు నిర్వహిస్తున్న వర్ష జపాలు పూర్ణాహుతితో ముగిశాయి. గురువారం వేద పండితులు వేద మంత్రాలతో వరుణ యాగాలు జపాలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, ఈవో శ్రీనివాసరెడ్డిలతో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కలశ ఉద్వాసన పలికి కలశంలోని జలాలతో స్వామివారిని అభిషేకించారు. దీంతో వరుడి కటాక్షం కోసం నిర్వహిస్తున్న వరుణ జపాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఏవో మధు, అధికారులు, సిబ్బంది, ధర్మకర్త మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడి టీచర్ లక్ష్మీ నారాయణమ్మకు సన్మానం



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ లక్ష్మీనారాయణమ్మ సేవలను గుర్తించి తోటి అంగన్వాడీలు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు షాహీన్, కొశీదమ్మ,మహేశ్వరమ్మనాగేశ్వరమ్మ,నయోమీ,రాజీ,నర్సమ్మ,జయమ్మ,జోతి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యపై టీడీపీ నాయకుడి చొరవ.

**సొంత ఖర్చులతో ముళ్ల కంపల తొలగింపు.**
**స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన శ్రీనివాస ఆచారి.**

ఆదోని (పల్లె వెలుగు): కొత్త బస్టాండ్ సమీపంలోని దివాకర్‌నగర్ ప్రాంతంలో రహదారులకు



అడ్డుగా పెరిగిన ముళ్ల కంపలను టీడీపీ నాయకులు తొలగించారు. మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస ఆచారి గురువారం తన సొంత ఖర్చులతో ముళ్ల కంపల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస ఆచారి మాట్లాడుతూ.. నివాస ప్రాంతాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరగడంతో పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ముళ్ల కంపల కారణంగా పాములు, విషపురుగులు ఇళ్లలోకి వస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని చెప్పారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు సొంత ఖర్చులతో ముళ్ల కంపలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు శ్రీనివాస ఆచారి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చాంద్, డిష్ ఈరన్న, డిష్ రవి, నరేంద్ర, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మహానందిలో దసరా ఉత్సవాల ఏర్పాట్లు
# పరిశీలించిన చైర్మన్, ఈవో

మహానంది, పల్లె వెలుగు మహానంది క్షేత్రంలో జరుగుతున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లను



చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, ఈవో శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ.. క్షేత్రంలో ఈ నెల 11 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలు వైభవంగా జరుపుతూ దిగ్విజయం చేస్తామన్నారు. బాలాజీ సేవా సమితి సభ్యులు పాల్గొని ఆలయంలో ఉత్సవాలకు ఉపయోగించే స్వామి వారి వాహనాలను,మండపాలను, సహస్ర దీపాలను శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మధు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం.




ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నూతన ఏఎస్పీగా 2024 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి జయ శర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఐపీఎస్ అధికారిగా ఆమెకు ఆదోని ఏఎస్పీగా ఇదే తొలి పోస్టింగ్ కావడం విశేషం. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏఎస్పీ జయ శర్మ మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. మహిళలపై వేధింపులు, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులను ఆశ్రయించాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు పోలీసు శాఖ అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేలా పోలీసు శాఖ సమన్వయంతో పనిచేస్తుందని ఏఎస్పీ జయశ్రీ తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

# నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు



మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన నందీశ్వరుడికి వేద పండితులు ప్రదోషకాలంలో విశేష అభిషేకాలు, అర్చనల పూజలను వేదోక్తంగా చేశారు. గురువారం భాద్రపద బహుళ త్రయోదశి నంది ప్రదోషం సందర్భంగా దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో విశేషాభిషేకాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలోనే గణపతిపూజ, ద్రవ్య పూజ పీఠార్చన,గంధం, పలురకాల చూర్ణాలతో అభిషేకించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# విజయనగర్ కాలనీలో బోరు సమస్యకు పరిష్కారం.

**-టీడీపీ నాయకుల చొరవతో మరమ్మతులు పూర్తి.. కాలనీ ప్రజలకు ఊరట.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలోని 5వ వార్డు విజయనగర్ కాలనీలో గత కొన్ని



రోజులుగా బోరు పనిచేయకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ ప్రజలకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. బోరు మరమ్మతులో ఉందని తెలుసుకున్న స్థానికులు ఈ సమస్యను టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కే. మీనాక్షి నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఉమాపతి నాయుడు, భూపాల్ చౌదరి, మారుతి నాయుడు, సిద్ధార్థ నాయుడు సూచనలతో సచివాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఏఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, హరి రామ్ నాయక్ ఆధ్వర్యంలో బోరు మరమ్మతు సిబ్బంది విజయనగర్ కాలనీకి చేరుకుని బోరును పరిశీలించి మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో కాలనీ ప్రజలకు నీటి సమస్య తీరడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన నాయకులు, అధికారులు, సిబ్బందికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి అమర్ ప్రకాష్, నాగరాజు, రవి, రసూల్, శేషప్ప తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బా పాఠశాలలో నూతన బోరు బావి ఏర్పాటు.

రుద్రవరం. పల్లె వెలుగు : మండల కేంద్రమైన రుద్రవరం లోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో త్రాగునీటి సౌకర్యం కొరకు గురువారం నూతన బోరు బావి ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఉన్న పాత బోరు బావి త్రాగునీరు సరిగా లేకపోవడంతో విద్యార్థులకు త్రాగునీరు అందించేందుకు కొత్త బోరు బావి ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ రాజకుమారిగనియా నిధులు మంజూరు చేయడంతో గురువారం పాఠశాలలో బోరు బావి వేసినట్లు ఇన్చార్జి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన బోరుకు విద్యుత్ మోటారు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు త్రాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయని ఏఈ తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి టిడిపి నాయకులు అల్లడి చంద్రశేఖర్, అన్నదాత ఓబులయ్య తదితరులు ఉన్నారు.



# శ్రీశైలం ఐటిడిఏ ఏఎంఓను తక్షణమే బదిలీ చేయాలి.....

## ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ డిమాండ్.



పల్లె వెలుగు విజయవాడ. పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు, గత ఎనిమిదేళ్లుగా స్కూల్ ముఖం చూడకుండా ఐటీడీఏ కార్యాలయంలోనే డిప్యుటేషన్‌పై కొనసాగుతుండటంపై గిరిజన ప్రజా సమాఖ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆఫీసులోనే తిష్ఠవేసిన ఉపాధ్యాయుడిని తక్షణమే తిరిగి బడికి పంపించాలంటూ గురువారం విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ సరస్వతి మేడం కి వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా ఒకే చోట నంద్యాల జిల్లా శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో ఏ ఎం ఓ గా పనిచేస్తున్న పాల్వాయి రామాంజనేయులు అసలు పోస్టింగ్ పాల్తుట్ల ఆశ్రమ పాఠశాలలో ఉంది. రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరూ పాఠశాలల్లోనే విధులు నిర్వహిస్తుంటే, ఈయన మాత్రం పాల్తుట్ల స్కూల్ నుంచి జీతం తీసుకుంటూ, గత 8 సంవత్సరాలుగా శ్రీశైలం ఐటీడీఏ ఆఫీసులోనే డిప్యుటేషన్‌పై కాలం వెళ్లదీస్తున్నారని రాజు నాయక్ ఆరోపించారు.

అక్రమ వసూళ్లు, వేధింపుల ఆరోపణలు:

ఏ ఎం ఓ పై కార్యాలయంలో అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేయడం, వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే వార్డెన్లను, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లను డబ్బుల కోసం ఇబ్బందులకు గురిచేయడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, గతంలో మహిళా ఉపాధ్యాయులను మానసికంగా వేధించినట్లు కూడా ఆయనపై ఆరోపణలు ఉన్నాయని అన్నారు. అడిషనల్ డైరెక్టర్ స్పందించి -తక్షణ విచారణకు ఆదేశాలు. ఈ వ్యవహారంపై స్పందించిన అడిషనల్ డైరెక్టర్, సదరు ఉపాధ్యాయుడిని వెంటనే రిలీవ్ పాఠశాలకు పంపాలని శ్రీశైలం ఐటిడిఏ పి ఓ కు తెలియజేశారు.

# సోలార్ ఏర్పాటుకు కోటి నజరానా






బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 8: గ్రామాలలో వంద శాతం సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు వినియోగదారుల ముందుకు వస్తే కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు నజరానాగా ఇస్తుందని నంద్యాల విద్యుత్ ట్రాన్స్కో ఏడి సుబ్రహ్మణ్యం అన్నారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామంలో సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు గాను రైతులను ప్రోత్సహించేందుకు గురువారం సాయంత్రం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలకు విద్యుత్ వాడకం నిత్యవసరంగా మారిందని అన్నారు. రాబోవు రోజుల్లో బొగ్గును నీటిని ఆదా చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. పైసా ఖర్చు లేకుండా సోలార్ సూర్య రష్మి ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చు అని అన్నారు. ఇళ్లలో సోలార్ ప్యానల్ ను ఏర్పాటు చేసుకోవడం వల్ల గ్రిడ్ మీద ఆధార పడటాన్ని తగ్గించుకోవచ్చు అని అన్నారు. దీనివల్ల నెలవారి బిల్లులు కూడా ఆదా అవుతాయని చెప్పారు. సోలార్ నిర్వహణకు చాలా తక్కువ ఖర్చు అవుతుందని సౌర శక్తిని ఉపయోగించడం ద్వారా సంప్రదాయ ఇంధనాలు పవర్ గ్రిడ్ మీద ఆధారపడటం తగ్గుతుందని అన్నారు. సోలార్ ఏర్పాటుకు గాను కేంద్ర ప్రభుత్వం రాయితీలను కల్పించిందని ఏడి అన్నారు. ఒక కిలో వాట్ సిస్టంకు 30000 సబ్సిడీ, రెండు కిలోమీటర్ల సబ్సిడీకి 60 వేల సబ్సిడీ, మూడు కిలోమీటర్లు అంతకంటే ఎక్కువ సిస్టంకు 78 వేల రూపాయల వరకు సబ్సిడీ వస్తుందని అన్నారు. ఇంటి పైకప్పు పై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం బియ్యం సూర్యఘర్ ,ముఫ్ట్ బిజిలి యువజన కింద రాయితీ లభిస్తుందని అన్నారు. ఈర్ణ పాడు గ్రామంలో ఇప్పటికే 19 మంది వినియోగదారులు సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకొని లబ్ధి పొందుతున్నారని, వీరందరికీ ప్రతినెల జీరో యూనిట్లు కరెంటు వస్తుందని పేర్కొన్నారు. సోలార్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన 19 మంది వినియోగదారులందరినీ ఏడీ సుబ్రహ్మణ్యం అభినందించారు. గ్రామంలో 100% వినియోగదారులు సోలార్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం కోటి రూపాయలు ఇస్తుందని ఏడీ పేర్కొన్నారు. దీని ద్వారా ఆ గ్రామంలో ఉన్న వీధిలైట్లు పాఠశాలలు దేవాలయాలు కమ్యూనిటీ హాలు ప్రభుత్వ భవనాలకు ఈ నిధులతో సోలార్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని, దీనివల్ల కరెంటు పూర్తిగా ఆదా అవుతుందని ఏడీ పేర్కొన్నారు. వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వినియోగించుకొని సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని ఏడి సుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో అసిస్టెంట్ ఇంజనీర్ కంబగిరి తోపాటు ఈర్నపాడు గ్రామ విద్యుత్ వినియోగదారులు ప్రజలు పాల్గొన్నారు.

# జిందాల్ యాజమాన్యం చొరవతో రెండు గ్రామాలకు బోర్లు

**-గౌరు కుటుంబానికి, జిందాల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు : మండల టిడిపి అధ్యక్షులు పంట దిలీప్ కుమార్ రెడ్డి**



గడివేముల పల్లె వెలుగు దినపత్రిక గడివేముల:- టిడిపి ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే గౌరు చరితమ్మ హయాంలోని గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని మండల టిడిపి అధ్యక్షులు పంట దిలీప్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని బుజనూరు, గ్రంధివేముల గ్రామాలలో ప్రజలు ఎల్ నినో ప్రభావంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవడంతో బూజనూరు గ్రామానికి చెందిన టిడిపి మండల అధ్యక్షులు పంట దిలీప్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే గౌరు చరితమ్మ గారి దృష్టికి తీసుకొనిపోవడంతో చరితమ్మ, గౌరు వెంకట రెడ్డిగారు జిందాల్ యాజమాన్యంతో మాట్లాడి గురువారం బుజనూరు, గ్రంధివేముల గ్రామాలలో రెండు బోర్లు వేయించారని, సహరించిన జిందాల్ యాజమాన్యానికి దిలీప్ కుమార్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు పంట దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే గౌరు చరితమ్మ హయాంలోనే గ్రామాలు అన్నీ విషయాలలో అభివృద్ధి పథంలో ఉంటాయని, అందుకు నిదర్శనమే గత రెండు సంవత్సరాల నుండి జరుగుతున్న రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, దేవాలయాలు, త్రాగు నీటి సౌకర్యాలు అని, ఇంకా భవిష్యత్తులో కూడా సమస్యలు లేని గ్రామాలుగా తీర్చి దిద్దటమే గౌరు చరితమ్మ లక్ష్యమని అన్నారు. బుజనూరు, గ్రంధివేముల గ్రామాలలో వేసిన బోర్ల లో కూడా దేవుని దయతో కొత్తగా వేసిన బోర్లలో నీరుకూడా 2.5/4 ఇంచుల నీరు పడిందని, కష్ట కాలంలో సహకరించిన జిందాల్ యాజమాన్యానికి బూజనూరు, గ్రంధివేముల ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జె ఎస్ డబ్లు సీ ఎస్ ఆర్ వారు, జె ఎస్ డబ్లు భాస్కర్, బుజనూరు టిడిపి సీనియర్ నాయకులు పంట రామచంద్రారెడ్డి, గ్రంధివేముల టీడీపీ సీనియర్ నాయకులు ఎస్వీ రామమోహన్ రెడ్డి, గ్రంధివేముల, బుజనూరు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కంటి ఆరోగ్యం పై అవగాహన పెంచుకోవాలి

**-కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ప్రపంచ దృష్టి దినోత్సవ వేడుకలు**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, నివారించగల అంధత్వాన్ని అరికట్టడం లక్ష్యంగా కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రాంతీయ కంటి ఆసుపత్రి నుంచి డి ఎం హెచ్ ఓ కార్యాలయం మీదుగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కంటి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం, కంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం, నివారించగల దృష్టిలోపాన్ని అరికట్టడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.కంటి ఆరోగ్యానికి ప్రతి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా సత్యనారాయణ రెడ్డి, నేత్ర వైద్య విభాగం హెచ్ ఓ డి డా యుగంధర్ రెడ్డి, డీపీఎం - డి బి సి ఎస్ డా హిమబిందు, ప్రాంతీయ కంటి ఆసుపత్రికి చెందిన నేత్ర వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు, ఆప్టోమెట్రిస్టులు, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, డి బి సి ఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు రూ.43 వేల వేతనం ఇవ్వాలి.

- ఎన్నికల హామీలను అమలు చేయాలి.. పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలి.
- ఈనెల 24న కర్నూలు నుంచి రాయలసీమ బైక్‌యాత్ర.

ఆదోని (పల్లె వెలుగు): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు జీవో ప్రకారం నెలకు కనీస వేతనం రూ.43 వేలు చెల్లించాలని, ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న కర్నూలు నుంచి ప్రారంభమయ్యే రాయలసీమ రెండో దశ బైక్‌యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదోని సీఐటీయూ కార్యాలయంలో విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశం యూనియన్ అధ్యక్షుడు షేక్షావల్లి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. అంజిబాబు, పట్టణ అధ్యక్షుడు తిప్పన్న, పట్టణ కార్యదర్శి పి.ఎస్. గోపాల్ మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో కాంట్రాక్ట్ కార్మికులు నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ వారి సమస్యలను ప్రభుత్వం




పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు రెగ్యులర్ చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో ప్రకారం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.43 వేల కనీస వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్--సీఐటీయూ ఆధ్వర్యంలో నిరంతరం ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాయలసీమ రెండో దశ బైక్‌యాత్రలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు నాగరాజు, రంగస్వామి, వన్నూరప్ప, వీరేష్, మధుసూదన్, మురళి, గాది లింగ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి.

- కార్మిక చట్టాలను పునరుద్ధరించి అమలు చేయాలి.
- డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో చలో ఢిల్లీ 48 గంటల ధర్నాను విజయవంతం చేయాలి : సీఐటీయూ.

ఆదోని (పల్లె వెలుగు): లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి, గతంలో అమల్లో ఉన్న కార్మిక చట్టాలను పునరుద్ధరించి అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న 48 గంటల ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదోని సీఐటీయూ కార్యాలయంలో అనుబంధ యూనియన్ల సమావేశం పట్టణ నాయకుడు పి.ఎస్. గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. అంజిబాబు, పట్టణ కార్యదర్శి తిప్పన్న, నాయకులు హనుమంతు, డి. కృష్ణమూర్తి, నేతప్ప తదితరులు పాల్గొని మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసి లేబర్ కోడ్స్‌ను తీసుకురావడం వల్ల కార్మికుల హక్కులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని సీఐటీయూ




నాయకులు పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న వివిధ కార్మిక చట్టాల వల్ల ఉద్యోగులు, కార్మికులకు హక్కులు లభించాయని తెలిపారు.లేబర్ కోడ్స్ అమలుతో కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, యూనియన్ హక్కులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు పీఎఫ్, ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో హమాలీ, ఆటో కార్మిక సంఘాల నాయకులు రాము, గోవిందు, షేకన్న, శ్రీనివాసులు, ఈరన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆదోనిలో హైటెన్షన్.. న్యాయవాదుల మధ్య ఘర్షణ!

ఆదోని (పల్లె వెలుగు), అక్టోబరు 8: ఆదోని పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఇద్దరు న్యాయవాదులకు సంబంధించిన వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో న్యాయవాది వై.ఆర్. మల్లికార్జునకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం.

పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని తిరుమలనగర్‌లోని ఓ స్థలానికి సంబంధించి రెండు వర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో ఇరువర్గాలు తమ తరఫున న్యాయవాదులను నియమించుకున్నట్లు తెలిసింది.

ఈ క్రమంలో బుధవారం కోర్టు ప్రాంగణంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం.

ఈ ఘటనకు సంబంధించి మల్లికార్జున తరఫు న్యాయవాదులు టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం పురుషోత్తం రెడ్డి తన అనుచరులతో కలిసి గతంలో జరిగిన ఘటనపై పోలీసులను కలిసేందుకు స్టేషన్‌కు వచ్చిన సమయంలో ఇరువర్గాల మధ్య మరోసారి ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం.

స్టేషన్ వద్ద భారీగా చేరిన ఇరువర్గాలు ఘర్షణ నేపథ్యంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద



ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమై ఇరువర్గాలను చెదరగొట్టారు. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరువర్గాలకు చెందిన కొంతమందిని అదుపులోకి తీసుకుని ఘటనపై విచారణ చేపట్టినట్లు సమాచారం.

న్యాయవాదుల ఘర్షణపై చర్చ

సాధారణంగా న్యాయపరమైన వివాదాలను చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించాల్సిన న్యాయవాదులే బహిరంగంగా ఘర్షణకు దిగినట్లు వచ్చిన వార్తలతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉద్రిక్తత నెలకొనడంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న ప్రజలు, వాహనదారులు పరిస్థితిని ఆసక్తిగా గమనించారు.

ఇదిలా ఉండగా, ఆదోని ఏఎస్పీగా జయశ్రీ బాధ్యతలు స్వీకరించిన రోజే ఈ ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా చర్చకు దారితీసింది. ఘటనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ఇరువర్గాలపై కేసులు నమోదు చేస్తారా? అనే అంశాలపై ప్రస్తుతం ఆసక్తి నెలకొంది. పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# డీఐజీ, ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఆదోని ఏఎస్పీ జయశర్మ.

ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్‌లను ఆదోని ఏఎస్పీ జయశర్మ ఐపీఎస్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదోని సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళలు, బాలికల భద్రత, నేరాల నియంత్రణ, పోలీసింగ్ విధానాలపై ఉన్నతాధికారులతో ఏఎస్పీ జయశర్మ చర్చించారు. సబ్ డివిజన్‌లో పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించే అంశాలపై కూడా చర్చించినట్లు తెలిపారు. అనంతరం డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లకు ఏఎస్పీ జయశర్మ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో భాగంగా ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి సబ్ డివిజన్ పరిస్థితులను వివరించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.



# ఆటో వివాదం పై ఘర్షణ.. వ్యక్తిపై కేసు నమోదు

మహానంది, పల్లె వెలుగు మహానందిలోని ఈశ్వర్ నగర్ కాలనీకి చెందిన ఇరువురు వ్యక్తులు ఆటో డబ్బుల విషయంలో బుధవారం రాత్రి గొడవ పడినట్లు ఎస్ఐఎన్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. సుర సుర వెంకటరమణ అనే వ్యక్తి రాజశేఖర్ కు ఆటో విక్రయించారన్నారు. డబ్బులు విషయంలో ఇద్దరు మధ్య వాగ్విదాదం చోటు చేసుకోవడంతో సొరకాయల రాజశేఖర్ అనే వ్యక్తి కూరగాయల కోసే కత్తితో వెంకటరమణ పై దాడి చేశారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు.

# వడదెబ్బ సోకి మహిళ మృతి.





రుద్రవరం. పల్లె వెలుగు : మండలంలోని కొండమాయపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ( 59) అనే మహిళ వడదెబ్బ సోకి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వివరాల మేరకు గురువారం లక్ష్మీదేవి ఆర్ నాగులవరం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో పచ్చి మిరప కాయలు కోయడానికి తోటి కూలీలతో పాటు వెళ్లిందన్నారు. అక్కడ ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో పచ్చిమిరపకాయలు కోస్తూ అస్వస్థతకు గురైందన్నారు. పని ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత తనకు ఆరోగ్యం సరిగా లేదని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు ఆమెను చికిత్స నిమిత్తం రుద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ కొలుకోలేక మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలకు భర్త నడిపి రంగముని, ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి ఎన్ఎండి ఫరూక్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ




సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాల మంత్రి క్యాంపు కార్యాలయం నందు నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువురు తమ సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రి ఫరూక్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆయన తక్షణమే ఆయా సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం తరపున, తెలుగుదేశం పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# అడవులు వన్య ప్రాణులను కాపాడుకుందాం.





రుద్రవరం. పల్లె వెలుగు : అడవులు వన్య ప్రాణులను కాపాడుకుందామని రుద్రవరం అటవీ రేంజ్ సబ్ డిఎఫ్ ఓ శ్రీనివాసరెడ్డి, రేంజి ఆఫీసర్ ముర్తుజావలి అన్నారు. గురువారం 72వ వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా రుద్రవరం లోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ ఆధ్వర్యంలో పశువుల వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ మాట్లాడుతూ అడవుల్లో వన్యప్రాణులకు సోకే వ్యాధులు వాటి నివారణ వాటిని ఎలా రక్షించాలి టీకాల ప్రాముఖ్యత అటవీ ప్రాంత సమీపాన ఉన్న గ్రామాల పశువుల కాపరులు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం సబ్ డీఎఫ్ ఓ శ్రీనివాసరెడ్డి, రేంజ్ ఆఫీసర్ ముర్తుజావలి మాట్లాడుతూవన్యప్రాణి వారోత్సవాల ఉద్దేశ్యం, అడవులు మరియు వన్యప్రాణుల ప్రాముఖ్యత గురించి వివరించారు.అడవి జంతువుల బారి నుండి తమ పంట పొలాల రక్షణ నిమిత్తం ఏర్పాటు చేసుకునేటువంటి కార్యకలాపాలలో భాగంగా రైతులు పంటపొలాలకు విద్యుత్ తీగలను అమర్చడం,ఉచ్చులు, వలలు మరియు ఇతర అక్రమ వేట పద్ధతుల వల్ల కలిగే నష్టాలపై గ్రామస్థులకు వివరించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, అక్రమ వేటను నిరోధించడం మరియు వన్యప్రాణుల ఆవాసాలను కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వన్యప్రాణి వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన ముత్యాలపాడు, అహోబిలం లో నిర్వహించిన ఏకో ట్రైల్ వాక్ లో గెలుపొందిన విద్యార్థులకు వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు పురస్కారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు పి మాబుఖాన్, జి శ్రీనివాసులు, టీ రామకృష్ణ వి జేమ్స్ పాల్, బీట్ ఆఫీసర్లు ఈ,సురేంద్ర గౌడ్ , నాగ హుస్సేనయ్య , మదన గోపాల్,బిఈ నగేష్ సిబ్బంది ప్రొటెక్షన్ వాచర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com